స్కెచ్

# పరిష్కారం



మా కోటయ్యగోరు, ఒమరేంద్ర గోరు కతలూ, కమామిసలంటూ బీరకాయలు, వంకాయల గురించి మనం మాట్టాడుకుంటమే అదే మోత్తరుగా తెగ మాట్టాడేసుకుంటరండి. నాకేమో ఒక ముక్క గూడా అరదమై సావదు. ఏదో రబసకిందుం టాది. నిజం,సెప్పొద్దూ,ఈల్లు సంసారం గురించి, పిల్లల గురించి సంపాదన మంచి సెడూ గురించి ఏవి మాట్టాడుకోరండె! ఇసిత్రపు మడుసులు! ఎంతయినా మొగోల్లు కదా, మనం మద్దెన మాటాడతం ఎందుకు అని శానా ఓపిక పట్టినా. ఈల్ల కాయితాలకి, కలాలకి, ఎవరో రసియితలంట ఆరిసుట్టూ తిరుగుతానికి ఎంత నట్టమైపోతుందోమరి, సూత్తూ ఎలా ఊరుకో బుద్దయితాది. ఈయాల నా మొగున్నయితేఅడుగంటా శాపలబుట్టని దులిపి నట్టు దులిపేసినా. అయితే ఏంనాబం, ఎవ్వారం మా మూలే. అతిగా సాగదీత్తే ఏకు మేకైతిదేమొ అని బయమేసి నాది. ఇప్పుడు అట్టట్టా గాలికి తిరిగినా ఆదీ సికట్లు కమ్మ్కేనాకయినా ఇల్లు సేరుతుండ్రు. నాకెందుకులే అని సరిపెట్టుకున్ననండి. మరి పిల్లకాయల సదువుసందెలైనా పట్టించుకోకుండా ఈ. తిరుగుళ్ళు నాయమేనా?మీరే సెప్పండి.

ఒమరేంద్రగోరి పెల్లానికి కొత్త సదువొచ్చంట. ఆయెమ్మొ పిల్లోల్లమంచి సెబ్బరా సూసుకుంటాది. మరి నాలాటి దాని మాటేటి? నాదేమొ వానాకాలపు సదువాయె, మంచి సెబ్బరైతే సెప్పగల్ను గానీ ఆల్ల బయిసెత్తేంది. మా కోటయ్య గోరికేమొ సీకుసింత నేదాయె. ఆయనేరో 'సెలం' గోరంట, ఈల్లకి దేవుడంట! ఆయనా పిల్లోల్ల మంచి సెబ్బరా సూడకుండా ఆల్ల ఇట్టానికి పెరగమనీ ఒదిలే సిండంట! అవ్వ! ఈల్లకీ బాగా నూరిపోసి నట్టుండు. సెప్పెటోల్లు నేక సెడిపోయినట్టుండరు. ఈల్లకి ఏల్లొచ్చినయి గాని ఇవరం రాలే! ఈల్లు బుడ తలకి బుద్దులేటి సెపుతారు. ఇంతకీ ఆల్లననేంనాబం, ఈల్లని పుట్టించిన ఆ బగవంతున్ని అనుకోవాలె. ఈల్ల 'ని మాకేసి కట్టిన అమ్మాబాబుల ననుకోవాలి.

ఈల్లకి ఒంటికో మంచిగుడ్డ కడదమని గాని, ఓ మంచి తిండి తిందమని గాని దాసె నేదు. ఈల్లకయన్నీ ఒద్దంట! సరుకు నాణ్ణెం వుండాలంట మడిసికి. అంటే? నాలాటోల్లంతా మడుసులు కానట్టేనా అని. నేను మా కోటయ్యగోరిని నిలదీసినా. 'ఎందుకే అట్టా నిల్దదీత్తవ్ మట్టిబుర్రా' అని ఓ మొట్టు మొట్టినడండి నా మొగుడు. ఇట్టాటి మడుసుల్తో సానా సావయితా దండి. శాదత్తం మొగుడు సెబితే ఇనడు, గిల్లితే ఏడుత్తాడంట్రు. కానీ ఈల్లు ఆ రకం కూడా కాదాయె. గిల్లితె ఎదురు గిల్లె. రకమండి! బాబో!

మా ఊల్లో బాపనాయన తాటాకుల పొత్తి సంకనెట్టుకు తిరిగినట్టు ఈల్లూ కాయితాల పొత్తి సేతబట్టిన రంటే రేయి గడిసిపోద్ది. ఈయాల మా ఆయనంటడూ 'నాఉరద యం ఇరగబూసిందే, పూలోసన రాటల్లేదేటే?' అని, 'అయినా నీకు ముక్కుం టీగా' అన్నడు. నాకయితే అరికాల్లోంచి బుర్రలోకి సిర్రెత్తినాది. అయన ఉరదయంలో ఇరగ బూసిన పూల్ని సూసేందుకు నేను ఆయన గోరి ఉరదయం తలుపు తట్టి పిలుసుకోవాలంట! మదుర బావాలు మొలకలెత్తించ లంట! ఇదేనా ఏటి నా పని. బావాలు, అవాలు అంటూ నాను ఈయన కూడా కూడా తిరిగితే, సివరికి మిగిలేది బూడిదే. అయినా ఈల్లకిదే నాయం సెప్పండి. పిలిసి పిల్ల నిత్తం అనంగానే సేజాపి శాత బట్టి తెచ్చినారు గందా. ఇట్టా ఇడుములు పాలు సేయటానికా?

మా ఆయన కీ మద్దెన గుబులుగా వుందంట. కొండలుకోనలుపిలుత్తున్నాయం ట! కాసంత ఆటిని పోయి పలకరిచ్చి వత్తడంట ... ఆ పపంచంలో ఏముందో సూత్తాడట, తిరుగుతూ సత్తా, సూత్తా తిరుగుతూ ఉంటనంటె, నాను సిలక్కిసెప్పినట్టు సెప్పినా 'అంత మరీ ఏముంది ఆడ సూట్టానికి, నా మాటినుకో. ఉత్తపున్నానికి ఎందుకు తిరగతవు, ఆ రాల్లల్లో రప్పల్లో బడొ, ఒంటి సేటేగాని మంచి జరిగేనేమి నేదు. ఇశ్రాంతిగా బచ్చో, నలు గెట్టి నీల్లోసి, కమ్మగ వండి పెడతనన్న పేరుగా. ఇనేవాల్లకు సెబితేనాబం. అయినా ఈల్లు సదూకున్న బాబులే గంద. ఈ ఎత్తి ఏంది ఈల్లకి. కొండల్లో పుట్టిన నీల్లు సయిద్రం లో పడతయి గాని, తిరిగి కొండల్లో కొత్తయ్యా! అట్టానే.పోయిన కాలం తిరిగి రమ్మంటే వత్తాదా? దీపం ఉండగనే ఇల్లు సక్కబెట్టుపోవాలి గంద.

ఈల్లు ఉత్తి అమాయక మడుసులనుకున్నా గాని అంత అమాయకులు గాదండొ, కట్టి సేతికిచ్చి గంగలో దింపి, ఈదుకో సంసారాన్ని అని సేతులు దులుపుకొని, సక్కంగా ఇట్ట మొచ్చినట్టు, కాయితాల కట్టలతో ఊరే గుదాం అనే తెలీతేటలు ఎట్టా అబ్బినయ్యా అని ఈల్లకి. అందరి పెల్లాలూ మొగుల్ని మాటఇనుకునేట్టుగా మలునుకుంటారంట. నా ఇసయం తెలిసినోల్లందరు నాను తెలివయిన దాన్నంటరు. ఎందుకీ తెలియి. మొగుణ్ణి సేతబట్టనేని తెలియి. ఈల్లకి, ఇంత కీఇలా పెల్లాల్ని ఒప్పించి తప్పించుకునే తెలివీతేటలు ఎట్టా అబ్బినియ్యా అని! ఒకేల ఆ కాయితాల్లో సతికి నేర్సినారేమొ? ఏమొ, ఏ పుట్టలో ఏ పాముందో?

మేం గూడా ఆ కాయితాల పొత్తల్లలోకి తొంగి సూత్తే పోలా?!.

- విష్ణుప్రియ